క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


చాకలి మల్లయ్య

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన చాకలి మల్లయ్య (35) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని తల్లి లక్ష్మి, తండ్రి వెంకటేశులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ ఆదివారం తెలిపారు. నెల 16న సెల్‌ఫోన్ ఇంట్లో వుంచి వెళ్లిపోయాడన్నారు. భార్య రేవతి, పిల్లలకు సంక్రాంతి సెలవులు రావడంతో పుట్టింటికి వెళ్లడంతో భార్య దగ్గరికి వెళ్లాడనుకున్నామని, అయితే అక్కడకు వెళ్లలేదని తెలిపారు. బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని చెప్పారు.

నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మద్దికెర : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా అప్పులు తెస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వాగ్దానాలను అమలు చేయాలని డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతగా గుండ్లకొండ జట్టు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తుగ్గలి : మునిస్వామి ఉరుసు సందర్భంగా నల్లగుండ్లలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గుండ్లకొండ జట్టు విజేతగా నిలిచింది. పోటీలను పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ ప్రారంభించారు. ఫైనల్ పోటీల్లో ఆదివారం గుండ్లకొండ-వర్కూరు జట్లు తలపడగా గుండ్లకొండ జట్టు విన్నర్స్‌గా వర్కూరు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో వెంకటాపురం, బోయ బొంతిరాళ్ల జట్లు నిలిచాయి. విజేతలకు వరుసగా దాతలు రంగప్ప, కోళ్ల రంగన్న రూ.20,016, మజీద్ రూ.15,016, సత్యప్రకాష్ రూ.10,016, దేవదాసుగౌడ్ రూ.5,016 నగదును అందజేశారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజ మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దర్శనం కోసం ఏపీ, కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్థానిక ఆస్పరి మఠంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు


నల్లగుండ్లలో ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ

తుగ్గలి : మండలంలోని నల్లగుండ్లలో వెలసిన హజరత్ సయ్యద్ మునీర్ బాషా(మునిస్వామి) ఉరుసును ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా దర్గాకు వెళ్లి చక్కెర చదివింపు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రూ.8లక్షలతో నూతనంగా కట్టించిన ముఖద్వారాన్ని ప్రారంభించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు,ఈశ్వర్ డిమాండ్ చేశారు. స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆదివారం ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ఆటో కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, చలాన్ల పేరుతో పోలీసులు, ఆర్టీఏ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రించి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. శాపంగా మారిన జీవో 21, 31ను తక్షణమే రద్దు చేయడంతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకుడు భీమలింగప్ప, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, రాజప్ప, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైతు నిస్సహాయ కేంద్రాలు!

- నిర్వీర్యమవుతున్న ఆర్బీకేలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో వీటి ద్వారానే రైతులకు సంక్షేమ పథకాల వర్తింపు
- నాడు విత్తనాలు, ఎరువులు, మందులన్నీ గ్రామస్థాయిలో అందజేత
- గత ప్రభుత్వంలో వివిధ పథకాల కింద రైతులకు రూ.850 కోట్లు లబ్ధి
- నేడు రైతులకు అందని సంక్షేమ పథకాలు, అమలవని హామీలు


హులేబీడు గ్రామంలోని రైతు సేవా కేంద్రం



హత్తిబెళగల్‌లో రాయితీ పరికరాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్), పెద్దహోతూరు ఆర్బీకే వద్ద రైతుల నుంచి శనగ విత్తనాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆలూరు రూరల్: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయం,ఉద్యాన శాఖల ద్వారా అందించే సంక్షేమం, విత్తనాలు,ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలు అందించేందుకు గత ఐదేళ్ల పాటు రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి సేవలను నిలిపివేసింది. నిన్నటి వరకు అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడిన కార్యాలయాలు, యంత్రాలు నేడు నిరుపయోగంగా మారాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో..

ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రెండు వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 98 రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు రూ.20 నుంచి రూ.23 లక్షల చొప్పున వెచ్చించి నిర్మించింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి దశల వారిగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల నగదు జమ చేసింది. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలోని 62,217 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.379 కోట్లు జమ చేయగా..52,941 మంది అన్నదాతలకు రూ.120 కోట్లు నగదు చెల్లించింది. 55,650 మందికి రూ.350 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా నేరుగా రైతు ఖాతాల్లోకి సొమ్ము చేర్చింది. అన్నం పెట్టే అన్నదాతకు అండగా నిలిచింది.

హామీలు పక్కన పెట్టిన ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాది ఖరీఫ్ ముగిసింది. మరో వారంలో రబీ సీజన్ కూడా ముగుస్తుంది అయినప్పటికీ ఆ పథకం అమలు ఊసే లేదు. జగనన్న పాలనలో పంట నష్టపోతే రైతులకు పరిహారం అందించేందుకు ఉచిత పంట బీమాను వర్తింపజేసింది. ఇందుకు ప్రీమియం భారాన్ని నాడు ప్రభుత్వమే భరించింది. నేడు మాత్రం బీమా బాధ్యతను రైతులపై మోపి భారం దించుకుంది. ఒక్కో పంటకు ఒక రేటు చొప్పున బీమా చేయించింది. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు,ఎరువులు అందే పరిస్థితి లేకుండా పోయింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా నిర్వహణ చేపట్టారు.కానీ రైతులకు సాయం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు మండిపడుతున్నారు.


కమ్మరచేడు ఆర్బీకే వద్ద పురుగు మందు పిచికారీ పంపులు అందిస్తున్న అధికారులు (ఫైల్)


ఆలూరు ఆర్బీకే-1లో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

నాడు యంత్రాలు.. యంత్ర సాయం..

గత ఐదేళ్లపాటు ఆర్బీకేల ద్వారా రైతులు యంత్ర సాయం అందజేసింది. గ్రూపుగా ఏర్పడిన రైతులకు యంత్ర పరికరాలను అందజేసి వ్యవసాయంలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. దీంతో ఆధునిక యంత్రాలతో సేద్యం సులువుగా చేయగలిగి మంచి దిగుబడులు తీశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇక అర్హులైన రైతులకు వివిధ యంత్రాలు, ట్రాక్టర్లు అందజేసింది. అలాగే సాంకేతి సాయం అందుబాటులో ఉంచేందుకు కియోస్క్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎరువులు, విత్తనాలు, మందులు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు అవకాశముండేది. అలాగే ఆధునిక సాంకేతిక వినియోగం, మార్కెట్‌లో దిగుబడుల ధరలు, సమీప మార్కెట్‌లో ఉండే ధరల వివరాలు, వాతావరణం గురించి తెలుసుకునేవారు. అలాగే వివిధ రకాల వ్యవసాయ పుస్తకాలను వాటిలో అందుబాటులో ఉంచడంతో రైతులకు ఎంతో మేలు జరిగింది. కానీ ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు కాస్తా.. నిస్సహాయ కేంద్రాలుగా మిగిలాయి.

విత్తనాలు, ఎరువుల కోసం మళ్లీ పట్టణాలకు..

వైఎస్సార్‌సీపీ పాలనకు ముందు వరకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందాలంటే అదో ప్రహసనం. వాటిని సాధించుకుంటే పంట పండించుకున్నంతగా రైతులు సంతోషపడేవారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అవస్థలను దూరం చేసేందుకు గ్రామంలోనే అవసరమైన, నచ్చిన కంపెనీ ఎరువులు, విత్తనాలు, మందులు పొందేలా చేపట్టింది. దీంతో ఐదేళ్ల పాటు వీటి కోసం అన్నదాతలు పట్టణాలకు వెళ్లడం పూర్తిగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మళ్లీ రైతులు పట్టణాలు క్యూ కడుతున్నారు.

పంటనష్ట పరిహారం సకాలంలో అందించారు



రెండేళ్ల క్రితం నాకున్న 2.50 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. అప్పుడు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వచ్చింది. అప్పటి ప్రభుత్వమే ఉచితంగా పంట బీమా చేయించడం వల్ల ఎకరాకు రూ.40 వేల చొప్పున రూ.లక్ష పరిహారం నా బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. ప్రతి ఏటా ఖరీఫ్,రబీ సీజన్‌లో రూ.7,500 చొప్పున రైతు భరోసా అందేది. ఈ ఏడాది ఖరఫ్,రబీ సీజన్ ముగిసినా ఇంత వరకు అన్నదాత సుఖీభవ నగదు అందలేదు. రైతు పరిస్థితి దీనంగా మారింది. దీనికి తోడు బీమా భారం మాపైనే మోపడం దుర్మార్గం.

– హనుమేష్,రైతు,మొలగవల్లి

రైతు భరోసా సొమ్ముతో ఊరట



గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం నుంచి ఏటా రైతు భరోసా కింద రూ.15 వేలు సాగుకు ముందే అందించేవారు. దీంతో పెట్టుబడి ఖర్చులకు కొంత మేర ఊరట లభించేది. ఆ నగదుతో విత్తనాలు కొనేవాళ్లం. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామంలోనే ఎరువులు,విత్తనాలు అందేవి. ప్రస్తుతం ఎరువులు,విత్తనాల కోసం హాలహర్వి,ఆలూరు, ఆదోని,బళ్లారి ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. – గోపాల్,హాలహర్వి రైతు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పత్తికొండ(తుగ్గలి) : ఐసీడీఎస్ పత్తికొండ ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు 9ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీఓ లలిత ఆదివారం టో ప్రకటనలో తెలిపారు. తుగ్గలి మండలంలోని బొందిమడుగులలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), ఆయాలు పత్తికొండ-9సెంటర్ (ఈడబ్ల్యూఎస్), అటికెలగుండు-1 (ఓసీ), జొన్నగిరి దేశాయతండ(ఓసీ), జొన్నగిరి-4సెంటర్ (ఎస్సీ), జీజీరాల్ల (బీసీ బి), శభాష్‌పురం(ఓసీ), కోతిరాల్ల(బీసీ ఏ), బొల్లవానిపల్లి(ఓసీ), హోసూరు ఆయా పోస్టు (ఓసీ) ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అంగన్వాడీ పోస్టుకు 10వ తరగతి పాసై ఉండి 2024 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఆయా పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి 2024 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థినులు వివాహితురాలై, స్థానిక నివాసితురాలై ఉండాలని వివరించారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటలలోపు పత్తికొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వెల్దుర్తి, కృష్ణగిరి: ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు మండలాలు కలిపి 1 కార్యకర్త, 7 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. కృష్ణగిరి మండలంలోని కటారుకొండ-1 (ఓసీ) , లక్కసాగరం(ఓసీ రిజర్వేషన్), సూదేపల్లె-2 (ఎస్సీ), మల్లెపల్లె-2 (ఓసీ), సంగాల(బీసీ-ఏ), గూడెంపాడు(ఓసీ), లింగాలపల్లె(ఓసీ), ఆలంకొండ-1 (ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు హలిగేరలో రీ సర్వే

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో సోమవారం రీ సర్వే ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం తెలిపారు. రీ సర్వే చేయించుకునే రైతులు పొలం పాస్ బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్సుతో పాటు రెండు పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కృష్ణగిరి: మండలంలోని ఎరుకలచెరువు గ్రామంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే భూయ రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ చంద్ర శేఖర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు సమన్వయంతో రైతుల భాగాస్వామ్యంతో సర్వే చేపడతామని పేర్కొన్నారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

దేవనకొండ: స్థానిక బస్టాండు సమీపంలో నివాసముంటున్న రాజశేఖర్, భారతి దంపతుల కుమారుడు ధర్మతేజ (8) ఇంటి బయట ఆదివారం ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో కుటుంబ సభ్యులు బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

నివాళి

హొళగుంద: అనారోగ్యంతో మృతి చెందిన తుంగభద్ర ప్రాజెక్ట్ రిటైర్డు లస్కర్ బోయ బ్రహ్మయ్య(63) మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బుసినే వెంకటేష్, ఎస్కే గిరి, మండల కన్వీనర్ షఫివుల్లా, హనుమప్ప, సిద్దప్ప, వెంకటేష్ తదితరులు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు.

'అమిత్ షా గోబ్యాక్'

ఆలూరు రూరల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రావడం, రాష్ట్ర ప్రజలను అవమాన పరిచినట్లేనని వామ పక్ష పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ,సీపీఎం ఆధ్వర్యంలో అమిత్ షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టి అమిషా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో అంబేడ్కర్‌ను అవమానపరిచినందుకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు భూపేష్, సీపీఎం మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు కృష్ణ,గోపాల్,బాషా, సిద్దలింగ, వన్నూర్ స్వామి,ఉలిగప్ప, ఈశ్వర్ గౌడ్, విఠల్ పాల్గొన్నారు.

స్టేషన్ మాస్టర్ అతడే..
టికెట్ బుకింగ్ క్లర్క్ కూడా..

కృష్ణగిరి(వెల్దుర్తి): వెల్దుర్తి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో తత్కాల్ రిజర్వేషన్ సందర్భంగా ప్రయాణికులు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా ప్రతిరోజు తత్కాల్ టికెట్ల సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. సెలవుల సందర్భంగా ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. వివరాలు..వెల్దుర్తి రైల్వే స్టేషన్‌లో పదేళ్ల క్రితం రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. సామాన్య టికెట్ బుకింగ్ కౌంటర్‌లోనే కంప్యూటరైజ్డ్ రిజర్వేషన్ కౌంటర్ సైతం ఏర్పాటు చేశారు. అయితే బుకింగ్ క్లర్క్‌ను నియమించకుండా రిజర్వేషన్ బాధ్యతలను స్టేషన్ మాస్టర్లపై ఉంచారు. ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు అవకాశం ఉండే జనరల్ టికెట్ రిజర్వేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు ఎదురవడంలేదు. అయితే తత్కాల్ రిజర్వేషన్ ప్రారంభమయ్యే సందర్భంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో, కౌంటర్లలో ఒకే సమయంలో తత్కాల్ బుకింగ్ ప్రారంభమవుతుండగా..ఇక్కడి రిజర్వేషన్ కౌంటర్‌లో ఆ టికెట్లు ఇచ్చే సమయంలో ఏదైనా రైలు రాకపోకలు సాగించినా, మరేదైనా రైల్వే సమస్య తలెత్తినా స్టేషన్ మాస్టర్ వాటిపైనే దృష్టి సారించాల్సి వస్తోంది. దీంతో తాత్కాల్ గడువు ముగిసిపోతుండటంతో ప్రయాణికులకు టికెట్లు అందడం లేదు. దీంతో స్టేషన్ మాస్టర్, ప్రయాణికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటోంది. ఇది నిత్యకృత్యంగా మారింది. రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ క్లర్క్‌ను ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.


వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దికెర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికలు రెండు ప్రతులతో సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

మద్దికెర : మానసిక ఒత్తిడిని జయించడానికి ప్రధాన ఆయుధం ధ్యానమేనని డాక్టర్ పుష్పావతి పేర్కొన్నారు. నేటి పరుగుల జీవితంలో అధిక శాతం ప్రజలు మానసికంగా కుంగిపోతూ అనారోగ్యపాలవుతున్నారని డాక్టర్ పుష్పావతి అన్నారు. ఆదివారం స్థానిక హార్ట్‌ఫుల్ నెస్ ధ్యాన కేంద్రంలో ధ్యాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ మనిషి బిజీ బిజీగా తన కాలాన్ని గడుపుతూ ప్రశాంతత కోల్పోతున్నారన్నారు. అందుకు పరిష్కారం ధ్యానం మాత్రమే అన్నారు. ప్రతి రోజు కొంత సమయాన్ని కేటాయించి ధ్యానం చేయాలని సూచించారు. కేంద్రం నిర్వాహకులు పక్కీరప్ప పాల్గొన్నారు.

21న దేవమ్మ, మారెమ్మదేవి కుంభోత్సవం

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో దేవమ్మదేవి, మారెమ్మదేవి కుంభోత్సవ కార్యక్రమాలను ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. 21న ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు గంగపూజ, కళసం కార్యక్రమాలు చేపడతామన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందన్నారు. 22న తెల్లవారుజామున 1:45 నుంచి 2:45 గంటల వరకు మేటి కుంభోత్సవం ఉంటుందన్నారు.

శనగల డబ్బులు ఇప్పించండి

ఆదోని రూరల్: పత్తికొండ మండలం హోసూరుకు చెందిన రాముడు అనే వ్యక్తి 2021 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డికి 200 క్వింటాళ్ల శనగలు అమ్మాడు. అందుకు సంబంధించిన డబ్బు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో రాముడు ఆదోని డీఎస్పీ సోమన్నకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. రామకృష్ణారెడ్డి, అతడి భార్య రంగమ్మ, బామ్మర్దిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు డీఎస్పీ వారిపై కేసు నమోదు చేసి సంబంధిత పత్తికొండ పోలీస్టేషన్‌కు రెఫర్ చేయాలని ఆదేశించడంతో ఇన్చార్జ్ ఎస్‌ఐ నాగేంద్ర కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డులోని నెట్టికల్ క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఢణాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, గోవర్ధన్ బైకుపై ఎమ్మిగనూరు నుంచి వస్తుండగా నెట్టేకల్ క్రాస్ రోడ్డు సమీపంలో డ్రమ్మును ఢీకొని కింద పడ్డారు. గాయాలపాలైన ఇద్దరిని స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

జర జాగ్రత్త బ్రదర్!

కృష్ణగిరి: ఈ దారిపై వెళ్లే వాహనదారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మూల్యం చెల్లించుకోవాల్సిందే. మండలంలోని ఎరుకలచెర్వు గ్రామం నుంచి ఆగవేళి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో అక్కడక్కడా రైతులు తమ పొలాలను చదును చేసుకోవడంలో భాగంగా పొలంలోని రాళ్లను తీసి రహదారి పక్కన వేశారు. ఈ దారిలో వేగంగా వెళ్లినా, అదుపు తప్పినా రాళ్లకు తగిలే అవకావముంది.


ఎరుకలచెర్వు నుంచి ఆగవేళికి వెళ్లే దారిలో రహదారికి ఇరువైపులా ప్రమాదంగా బండరాళ్లు

మూడు నెలలుగా వృథా..


పైప్ లైన్ లీకై వృథాగా పారిపోతున్న మంచినీరు

స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ప్రధాన రోడ్డు పక్కన పైప్ లీకేజీ కారణంగా మూడు నెలల నుంచి తాగునీరు వృథాగా పారిపోతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి నీరు రోడ్డుపై పారుతున్నా నీటి లీకేజీని అరికట్టకపోవడంతో కలుషిత నీటిని తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – హాలహర్వి


కాయలు నాణ్యతగా రాక ముందే పసుపు రంగులోకి మారిన వేరుశనగ పైరు


మచ్చ తెగులు సోకిన పైరు


తెగులుతో కాయలు నాణ్యతగా రాని దృశ్యం

మచ్చ తెగులుతో వేరుశనగ రైతు కుదేలు

- వేల ఎకరాల్లో పంటకు దెబ్బ
- కాయలు పిందెలుగా ఉన్నప్పుడు పసుపు వర్ణంలోకి పైరు
- వేగంగా విస్తరిస్తున్న తెగులు
- మందులు వాడినా అదుపులోకి రాని వైనం

కృష్ణగిరి: రబీలో నీటి లభ్యత కింద మండల వ్యాప్తంగా 2 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగుచేశారు. ఈ పంట సాగు ఖర్చుతో కూడికున్నది. విత్తనం కొనుగోలు, మందులు, సేద్యం, కూలీల తదితర ఖర్చులు కింద ఎకరాలో సాగుకు రూ.45 వేల నుంచి రూ.55 వేల వరకు ఖర్చు వస్తుంది. ఈసారి వాతావరణ ప్రభావం, మంచు అధికంగా కురుస్తుండటంతో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. వీటికి ఖరీదైన మందులతో పిచికారీ చేస్తున్నప్పటికీ ఫలితం లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పైరు కాయ దశలో ఉంది. ఈ సమయంలో ఒక్కసారిగా మచ్చ తెగులు చుట్టుముట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగులు సోకితే పంట పసుపు వర్ణంలోకి మారడంతోపాటు కాయలు నాణ్యతగా రాక పిందెలుగానే ఉండిపోతాయి. తెగులు పంట మొత్తం విస్తరించి దిగుబడికి సిద్ధం కాకముందే పసుపు వర్ణంలోకి మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించినా తెగులు అదుపులోకి రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.